జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 28-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 575 పేజీలు: 4 వెల : రూ.7

# బిల్లు కావాలంటే.. కాసులు ఇవ్వాల్సిందే!

శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం భూముల రీసర్వే జరుగుతోంది. కొందరు మండల రెవెన్యూ అధికారులు రీసర్వే జరుగుతున్న ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. రైతులతో కలిసి సర్వే జరుగుతున్న ప్రాంతాల్లో తిరుగుతున్నారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిచేసే ప్రక్రియ చేపట్టారు. ఇంతవరకూ బాగానే ఉన్నప్పటికీ కొందరు అధికారులు మాత్రం రైతుల నుంచి ఈ తప్పిదాలను సరిచేసేందుకు రైతులకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. జి.సిగడాం మండలంలో ఓ అధికారి ఏకంగా డబ్బులు ఇవ్వనిదే ఫైల్ ముట్టడం లేదని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే దృష్టికి సైతం తీసుకువెళ్లినట్టు సమాచారం. దీంతో ఎమ్మెల్యే సైతం ఆ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రభుత్వానికి మచ్చతెచ్చే పనిచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించినట్టు తెలిసింది. దీనిపై త్వరలో 'జాతీయ వార్త'లో సమగ్ర కథనం త్వరలో..)

* సచివాలయ ఉద్యోగికి రూ.15వేలు డిమాండ్ చేసిన ఖజానా ఉద్యోగులు * ఏసీబీకి సమాచారం అందించిన ఉద్యోగిని * 15వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ డీఎస్పీ * విశాఖ ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరుస్తామన్న డీఎస్పీ రమణమూర్తి



శ్రీకాకుళం క్రైం, జనవరి 27 (వార్త): ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు లంచావతారుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. బిల్లులు కావాలన్నా, పనులు జరగాలన్నా కాసులు ఇవ్వాల్సిందే.. లేకుంటే పనులు ముందుకుసాగిన దాఖలాలు లేవు. అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. రిజిస్ట్రేషన్, రెవెన్యూ, ట్రెజరీ, ఇలా ఒక్క శాఖ అని కాకుండా అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. అయితే కొందరు అవినీతి అధికారుల వల్ల అందరికీ మచ్చ తప్పడం లేదు. ఏసీబీ అధికారులు వల వేసి మరీ ఇద్దరు ఖజానా శాఖ ఉద్యోగులను పట్టుకున్న ఘటన శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం మండలం కిల్లిపాలెం-1 సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లోపింటి హేమరాగిణి అనారోగ్య కారణాలతో ఏడాదిన్నర పాటు లీవ్ పెట్టారు. ఆ కాలాన్ని ప్రభుత్వం లాస్ ఆఫ్‌పే పరిగణించింది. అనంతరం ఆమె విధుల్లో చేరగా.. కలెక్టర్ ఆమె ప్రొబేషన్‌ను 2023 మే 5 నాటికి డిక్లర్ చేశారు. 2023 మే 5 నుంచి 2025 డిసెంబరు 31 వరకు ఆమెకు రావాల్సిన జీతం బకాయిలు అందలేదు. ఆమె ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకుంది. దీంతో ఆమెకు రావాల్సిన రూ.4,34,697 బకాయి బిల్లు తయారై, ఈ నెల 10న శ్రీకాకుళం ఉప ఖజానా కార్యాలయానికి చేరింది. ఆమె ఈ బిల్లు కోసం ట్రెజరీ కార్యాలయంలో అకౌంటెంట్ అంబకండి శ్రీనివాసరావుతో పాటు ఎస్టీవో నల్లా రవిప్రసాద్‌ను కలిసింది. అయితే బిల్లు మంజూరు కావాలంటే రూ.20వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీంతో ఆమె రూ.15వేలు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఆ తర్వాత ఆమె ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసింది. వారి పథకం ప్రకారం హేమరాగిని మంగళవారం శ్రీకాకుళం ఉప ఖజానా కార్యాలయంలో ఎస్టీవో, అకౌంటెంట్‌కు రూ.15వేలు అందజేసింది. కార్యాలయం సమీపంలో ఉన్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐ భాస్కరరావు సిబ్బంది వారిద్దరినీ రెడ్ హ్యాండెంట్‌గా పట్టుకున్నారు. ఆ నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆ ఇద్దరిని విచారణ చేపట్టింది. వారిని అరెస్టు చేసి విశాఖపట్నంలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

# నేటి నుంచి.. శాలిహుండాం జాతర



* శ్వేతగిరిపై ఐదు రోజులు పాటు ఉత్సవాలు * 29న వేణుగోపాల స్వామి చక్రస్నానం * చక్రతీర్థ స్నానాలకు ప్రత్యేక భద్రత * ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**గార/శ్రీకాకుళం, జనవరి 27 (వార్త):** గార మండలం శాలిహుండం జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. శ్వేతగిరిపై కొలువైన కాళీయ మర్దన వేణుగోపాలస్వామి ఆలయంలో వచ్చేనెల 2 వరకూ మహోత్సవాలు కొనసాగనుంది. 28న సాయంత్రం ఉత్సవ మూర్తుల తిరువీధితో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 2న స్వామి కల్యాణంతో ముగుస్తాయి. బుధవారం అర్ధరాత్రి స్వామికి క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. 29న ఉదయం కొండపై కొలువైన వేణుగోపాలస్వామి, దిగువన ఉండే లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తులను వేర్వేరు పల్లకీల్లో పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ఆలయానికి సుమారు కిలోమీటరున్నర దూరంలోని వంశధార నది వద్దకు తీసుకొచ్చి చక్రస్నానం నిర్వహిస్తారు. శాలిహుండంలోని శ్వేతగిరిపై వేణుగోపాల స్వామి యాత్ర నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తుతో పాటు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఐపీఎస్ తెలిపారు. మంగళవారం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశవవీలించారు. ఈ నెల 29వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు కొండపైకి తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. క్యూ లైన్ల నిర్వహణ, క్రౌడ్ కంట్రోల్, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 29వ తేదీ ఉదయం ఉత్సవ మూర్తులకు వంశధార నదీ తీరంలో నిర్వహించనున్న చక్రతీర్థ స్నాన కార్యక్రమానికి పటిష్ట భద్రత కల్పించాలని స్పష్టంగా ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంతంలో గజ ఈతగాళ్ల (లైఫ్ గార్డులు) ఏర్పాటు, బ్యారికేడింగ్, భక్తుల నియంత్రణకు అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అపఘాతాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. యాత్ర మార్గాల్లో ముఖ్యమైన ప్రదేశాల్లో అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని,భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, తాగునీరు, వైద్య సేవలు, శౌచాలయాల ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా రద్దీ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, కమాండ్ కంట్రోల్ వ్యవస్థను సమర్థంగా వినియోగించాలని, అన్ని శాఖల మధ్య సమన్వయంతో ముందస్తు ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. భక్తులు శాంతియుతంగా, సురక్షితంగా స్వామివారి దర్శనం చేసుకునేలా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద, సీఐ పైడిపు నాయుడు, ఎస్సై గంగరాజు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ మధుసూదన్, పోలీసు అధికారులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.





### కమ్మసిగడాం మహాలక్ష్మి అమ్మవారి జాతర బందోబస్తుపై సమీక్ష

రణస్థలం మండలం కమ్మసిగడాం గ్రామంలో మూడు రోజుల పాటుగా నిర్వహించనున్న మహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా, సురక్షితంగా ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.వి. రమణ పోలీసు అధికారులు, సిబ్బందికి విధి నిర్వహణపై మంగళవారం ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించారు.

## క్రైం వార్తలు

### పలాసలో యువకుడి వీరంగం

* బ్లేడ్‌తో కోసుకుని రోడ్డుపై హల్‌చల్
* యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**పలాస, జనవరి 27(వార్త):** పలాస-కాశీబుగ్గ జంట పట్టణంలో ఓ యువకుడు మంగళవారం మద్యం తాగి హల్‌చల్ చేశాడు. బ్లేడ్‌తో చేయి కోసుకుని రోడ్డుపై తిరుగుతూ వీరంగం సృష్టించాడు. ఒక పక్క రక్తం కారుతున్నా పట్టించుకోకుండా రోడ్డుపై వెళుతున్న ప్రయాణికులపై దుర్భాషలాడాడు. కొందరు యువకులు అతడిని పట్టుకుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మళ్లీ ఆ యువకుడు రోడ్డుపైకి వచ్చి బైఠాయించాడు. ఎస్ఐ నర్సింహమూర్తి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. భార్య పుట్టింటికి వెళ్లి రాలేదంటూ మద్యం తాగినట్టు ఆ యువకుడు పోలీసులకు తెలిపాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**శ్రీకాకుళం, జనవరి 27 (వార్త):** జిల్లాలో రక్షణ, సంరక్షణ అవసరమైన బాలల కోసం నడుపుతున్న అన్ని కేంద్రాలు జువెనైల్ జస్టిస్ చట్టం-2015 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పర్యవేక్షణాధికారి ఒక ప్రకటనలో ఆదేశించారు. ప్రభుత్వ లేదా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే కేంద్రాలు, నిధులు పొందుతున్నా లేదా సొంతంగా నడుపుతున్నా.. ఈ చట్టం పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇతర చట్టాల కింద లైసెన్సులు ఉన్నప్పటికీ, జేజే చట్టం సెక్షన్ 41 ప్రకారం నమోదు చేసుకోవడం అనివార్యమని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ దరఖాస్తులను వచ్చే నెల 13వ తేదీలోగా సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులను స్పీడ్ పోస్ట్ లేదా నేరుగా జిల్లా పర్యవేక్షణాధికారి కార్యాలయం (శాంతినగర్ కాలనీ) లేదా జిల్లా బాలల సంరక్షణ అధికారి కార్యాలయంలో అందజేయవచ్చు. మరిన్ని వివరాల కోసం అదనపు జిల్లా పర్యవేక్షణ అధికారి బి.వి. రవికుమార్ (9100045398) లేదా జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి. రమణ (9440035576) వారిని సంప్రదించాలని కోరారు.



# సిక్కోలు బృందానికి ఢిల్లీలో సన్మానం

* రిపబ్లిక్ డే వేడుకల్లో భరతనాట్యంతో అలరించిన శ్రీకాంత్ బృందం * కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో శ్రీకాంత్ బృందం భేటి * సిక్కోలు కీర్తి చాటేలా మంచి ప్రదర్శన ఇచ్చారంటూ కితాబిచ్చిన రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం టౌన్, జనవరి 27(వార్త) :** దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపద్‌లో సోమవారం జరిగిన 77వ రిపబ్లిక్ డే వేడుకలల్లో సాంస్కృతిక ప్రదర్శన చేసిన శ్రీకాకుళానికి చెందిన రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం మంగళవారం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తో భేటి అయ్యారు. ఢిల్లి అక్బర్ రోడ్డులోని తన నివాసానికి విచ్చేసిన ఈ సిక్కోలు బృందానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆత్మీయ స్వాగతాన్ని పలికారు. రిపబ్లిక్ డే వేడుకలలో శ్రీకాకుళం కీర్తి చాటేలా మంచి ప్రదర్శన ఇచ్చారని కితాబిచ్చారు. తన తరపున పూర్తి ప్రోత్సాహం ఉంటుందని.. భవిష్యత్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో మరిన్ని వేదికలపై మంచి ప్రదర్శనలు ఇవ్వాలని ఆకాంక్షించారు. రిప్లబిక్ డే వేడుకల లాంటి ఉన్నతమైన వేదికలో తమ ప్రదర్శనకు అవకాశం లభించేలా పూర్తి తోడ్పాటు అందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు.. నృత్య శిక్షకుడు రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నాణ్యత లోపిస్తే సహించేది లేదు

### -మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు

**పలాస, జనవరి 27 (వార్త):** మున్సిపాలిటీ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు స్పష్టం చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సాయి కాలనీ ఎరుకోళ్ల సత్య రావు అపార్ట్మెంట్ ఏరియాలో ఐదు లక్షలు నిధులతో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ చైర్మన్ బల్ల గిరిబాబు పర్యవేక్షించి నాణ్యతా ప్రమాణాలు పాటించమని పనులు వేగంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా పూర్తి చేయమని కాంట్రాక్టర్లకు మున్సిపల్ ఇంజనీర్లకు ఆదేశించారు. మున్సిపాలిటీని అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం ఇవ్వాలని కోరారు. పనులు సకాలంలో పూర్తిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని కోరారు.

వార్డుల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి దిశగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ కిరణ్, వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, పెద్దలు బమ్మిడి నాగేశ్వరరావు, వల్లభ వైకుంఠ రావు, డి నాగభూషణరావు, కాంట్రాక్టర్ తలగాన వాసు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## వెంకటాపురంలో ఆంజనేయ ఆలయ మండపం కూల్చివేత

### -అడ్డుకున్న వారిపై దాడి

### - రాజకీయ కక్షతోనే

### ఈ అరాచకమంటున్న గ్రామస్థులు

**కొత్తూరు, జనవరి 27 (వార్త):** భక్తి వెల్లివిరియాల్సిన ఆధ్యాత్మిక క్షేత్రం రాజకీయ కక్షలకు వేదికైంది. కొత్తూరు మండలం మధనాపురం పంచాయతీ పరిధిలోని వెంకటాపురంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో చోటు చేసుకున్న విధ్వంసం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. 30 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయ మండపాన్ని కొందరు రాజకీయ నాయకులు తమ అనుచరులతో కలిసి కూల్చివేయడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు మూడు దశాబ్దాల క్రితం గ్రామస్థులంతా కలిసి స్వచ్ఛందంగా భూమిని సేకరించి, చందాలతో ఈ ఆంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించుకున్నారు. అయితే, ఇటీవల స్థానిక సర్పంచ్ తన సొంత నిధులతో ఆలయ అభివృద్ధి పనులను చేపట్టారు. ఈ అభివృద్ధి పనుల వల్ల సర్పంచ్‌కు గ్రామంలో మంచి పేరు వస్తోందని, దీనిని జీర్ణించుకోలేక ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి చెందిన కొందరు స్థానిక నాయకులు ఈ అరాచకానికి పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండపాన్ని కూల్చివేస్తున్న



వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన గ్రామస్థులపై నిందితులు విచక్షణా రహితంగా దాడులకు తెగబడ్డారు. పవిత్రమైన ఆలయ ప్రాంగణంలో ఇలాంటి దౌర్జన్యాలు చేయడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "దేవుడి సన్నిధిలో రాజకీయాలు చేయడం దారుణం. అభివృద్ధిని చూసి ఓర్వలేక దైవ కార్యానికి ఆటంకం కలిగిస్తారా?" అంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే మండల బీజేపీ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "రాజకీయ స్వార్థం కోసం ఆలయాలపై దౌర్జన్యం చేయడం క్షమించరాని నేరం. ఈ ఘటనకు కారకులైన వారితో పాటు, వారి వెనుక ఉండి నడిపించిన నాయకులపై కూడా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని, ఆలయ పవిత్రతను కాపాడాలని వెంకటాపురం గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



## పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు



**మందస, జనవరి 27(వార్త):** సొండిపూడిలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు బుగత సుందర్ సోలమన్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రవర్తన ఉత్తమంగా ఉండాలని, విధేయతకు మించిన జ్ఞానం లేదన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులలో గల షైనింగ్ స్టార్స్ 13మందికి మెడల్స్ బహుకరించారు. తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు కూడా మెడల్స్‌తో సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.కరుణకర్, వై.తులసిదాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేటి నుంచి నిద్దాలమ్మ తల్లి ఉత్సవాలు

**జి.సిగడాం, జనవరి 27(వార్త):** కోర్కెలు తీర్చే కల్పవల్లి నిద్ధాలమ్మ తల్లి 19వ వార్షిక యాత్రా మహోత్సవాలు నిద్ధాంలో బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఫిబ్రవరి 1 వరకు జరిగే ఈ ఉత్సవాలలో అమ్మవారికి ప్రతిరోజు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. జాతర సందర్భంగా అన్నదానం మరియు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



## జిల్లుండ, చీపిల్లో పశు వైద్య శిబిరాలు



**మందస, జనవరి 27(వార్త):** మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతిల ఆధ్వర్యంలో జిల్లుండ, చీపి సచివాలయాల పరిధిలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. రెండు సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాలలో వ్యాధి నిరోధక టీకాలు వేయడం, దూడలకు అంతర పరాన్నజీవులు మందులు తాగించడం చేశారు. పాడి రైతులకు పశు పోషణలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, పశుబీమా గురించి, పశుగ్రాసాల సాగు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ధర్మేంద్ర, ప్రసన్న, రవి, కళ్యాణ్, ఇంతియాజు, మురళి, నిత్యానందం, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమ, మాసయ్య, సురేష్, విజయానంద్, శ్రావణితో పాటు పాడిరైతులు పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రం చేయించిన ఆళ్ల



**పలాస, జనవరి 27(వార్త):** బ్రాహ్మణతర్ల గ్రామంలో ఈ నెల 29న భీష్మ ఏకాదశి సందర్భంగా పెద్ద వీధి, చాకలి వీధి, అంగన్వాడీ బిల్డింగ్, శివాలయంకి వేళ్ళే మార్గము, శివ కాలనీ పరిసరాలను పలాస మండల యూనిట్ కో కన్వీనర్ ఆళ్ల కృష్ణారావు పరిశుభ్రం చేయించారు. జేసీబీకి తన సొమ్మును వెచ్చించారు. ఆయనను జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వడ్డీ యాదగిరి, ఎంపీపీ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ తామర మోహనరావు, శాసనపూరి వెంకటరావు అభినందించారు. ఆ గ్రామస్తులు చాలా మంచి పని చేశారని ఆళ్ల కృష్ణారావును కొనియాడారు.

## పలాస రైల్వే గ్రౌండ్‌లో క్రికెట్ నెట్, పిచ్



**పలాస, జనవరి 27 (వార్త):** పలాస రైల్వే ఇనిస్టిట్యూట్ ఆవరణంలో జేబీసీ క్రికెట్ క్లబ్, రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్ సంయుక్తంగా క్రికెటర్ల కోసం నెట్‌తో పాటు పిచ్‌ను సిద్ధం చేశారు. క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలాస ఏపీ ఎన్జీవోస్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనేల గోపాల్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతంలో యువ క్రీడాకారులను తయారు చేయడానికి కోసం రైల్వే కాంగ్రెస్ యూనియన్ ఉద్యోగులు, జెబిసి క్రికెట్ క్లబ్ కలిసి ప్రోత్సహించడం మంచి పరిణామం అన్నారు. క్రికెట్ కోచ్ రాపాక జగదీష్ మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయి పోటీలకు ఈ ప్రాంతంలో కోచింగ్ ఇచ్చి యువ క్రీడాకారులను తయారు చేయడానికి తన వంతుగా ప్రయత్నిస్తున్నానని తెలిపారు. దీనిని ఈ ప్రాంత వాసులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్ నేతలు సిర్ల రాజశేఖర్, విక్రమ్ రామారావు, పీవీవీఎన్ రావు, రవి చౌదరి దువ్వాడ, భీమారావు, బీవైబీ నాయుడు, భాస్కరరావు, ప్రేమ్‌నాథ్, గ్రీన్ ఆర్మీ సభ్యులు నీలాపు లక్ష్మీనారాయణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## నరసన్నపేట ఎస్ఐగా గణేశ్



**నరసన్నపేట, జనవరి 27(వార్త):** నరసన్నపేట ఎస్ఐగా బలివాడ గణేశ్‌ను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి నియమించారు. బుధవారం నుంచి ఆయన విధులలో చేరనున్నట్లు తెలిపారు. గణేశ్ గతంలో సారవకోట, కోటబొమ్మాలి పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. క్రమశిక్షణ, ప్రజలతో సత్స బంధాలు కలిగి ఉన్న అధికారిగా పేరు పొందారు. గణేశ్ రాకతో నరసన్నపేటలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మత మార్పిళ్లపై జాగృతం కావాలి



**మందస, జనవరి 27(వార్త):** బలవంతపు, ప్రలోభపు మతమార్పిళ్లపై ప్రజలు జాగృతం కావాలని భరతవర్ష సేవా ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. గ్రామ గ్రామానికి భరతవర్ష అనే కార్యక్రమంలో భాగంగా భరతవర్ష సేవా ఫౌండేషన్ టీం పలు గ్రామాలలో పర్యటిస్తోంది. రాయకోల అనే ఆదివాసీ గ్రామంతో ప్రారంభమైన అనంతరం సింగుపురం, భోగాపురం, బడియావాల గ్రామాలలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలోని సమస్యలను ప్రభుత్వాలకు, అధికారులకు తెలియజేసి, పల్లె ప్రజలతో దేశభక్తి, ధర్మనిరతి సంబంధిత అంశాలపై చర్చించారు. భరతవర్ష సభ్యులు పలు కీలక అంశాలను వారితో మాట్లాడారు. ప్రధానంగా బలవంతపు, ప్రలోభపు మతమార్పిళ్లపై వారిని జాగృతం చేశారు. పేద, అమాయక ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని కొందరు అదేపనిగా గ్రామాల్లోకి చొరబడి మతాలను మారుస్తూ, మన భారతీయ సనాతన హిందూ ధర్మానికి వ్యతిరేకులుగా తయారు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మన భారత దేశ సంస్కృతి సంప్రదాయాలైన కట్టు, బొట్టు, గాజులు, ఇంటి ముందు ముగ్గు, ఇంట్లో దీపం ఇలా అన్నింటినీ దూరం చేయడమే కాకుండా కలహాలను రేపుతున్నారన్నారు. ఇలాంటి విషం చిమ్మే విషయాలపై హిందువులు తప్పక అప్రమత్తంగా ఉండాలని, ఎన్నో వేల ఏండ్ల చరిత్ర కలిగిన మన భారతీయ స్వధర్మాన్ని వీడటం మన కన్నతల్లిని దూరం చేసుకోవడం వంటిదేనని తెలిపారు. ప్రతీ గ్రామానికి చేరుకుంటున్న మన భరతవర్ష టీం.. గ్రామంలో పేదవారికి చీరలు, గొడగులు, పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, స్కూల్ బ్యాగులు వంటివి కూడా వితరణ చేశారు. కార్యక్రమంలో భరతవర్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దువ్వాడ శివప్రసాద్, టీం మెంబర్స్ హనుమంతు సురేష్, విద్యాసాగర్, నీలకంఠం ముక్కాల, దిలీప్ కుమార్ పాణిగ్రహి, దున్న హరి కృష్ణ, ఉపాధ్యాయులు ఉమాపతి, ఇతర వాలంటీర్లు పాల్గొన్నారు. రానున్న ఏడాది కాలంలో వంద గ్రామాలను చేరుకోవడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## నగేష్ మృతిపై సీబీఐ విచారణ జరిపించాలి

### -ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ డిమాండ్

**పలాస, జనవరి 27 (వార్త):** గడిచిన కొన్ని సంవత్సరాల క్రితం అనుమానస్పదంగా మరణించిన ఇంజనీరింగ్ విద్యార్థి మువ్వల నగేష్ మృతిపై సిబిఐ విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పలాస నియోజకవర్గం నువ్వలరేవు గ్రామానికి చెందిన ఆ మృతుని కుటుంబ సభ్యులకు జరిగిన అన్యాయం పట్ల ఇటీవల కాలంలో జరుగుతున్న ధర్నాలకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్పందిస్తూ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ మంగళవారం మృతిని కుటుంబ సభ్యులను కలుసుకొని వారికీ 25,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆ మృతుని కుటుంబ సభ్యులకు భరోసాగా శాసన మండలిలో మీకు జరిగిన అన్యాయం పట్ల ప్రశ్నిస్తానని, గడిచిన కాలంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి వర్యులు నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ తమ ప్రభుత్వం వచ్చిన 100 రోజులలోగా ఆదుకుంటామని ఇచ్చిన హామీని నెరవేర్చి ఆ కుటుంబ సభ్యులకు న్యాయం చెయ్యాలని కోరారు. సిబిఐ



విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దువ్వాడ శ్రీధర్ (బాబా), హేమచలం, నవీన్ చౌదరి, రామ్ నరేష్ జినగ, అనిల్, వినోద్, గ్రామస్తులు, ప్రజలు, దువ్వాడ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలే భవిష్యత్ పునాదులు : బగ్గు




**జలుమూరు, జనవరి 27(వార్త):** కరవంజ ఏపీఎంఎస్ జూనియర్ కళాశాల 13వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల జీవితాలకు బలమైన పునాదులు వేస్తాయని ఆయన అన్నారు. కష్టపడే తత్వం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏ విద్యార్థైనా ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని, గురువులను గౌరవిస్తూ తల్లిదండ్రుల కలలను నిజం చేసే దిశగా ముందుకు సాగాలని హితవు పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పాఠశాల నుంచి భవిష్యత్తులో డాక్టర్లు, ఇంజినీర్లు, అధికారులు తయారవ్వాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఇతర ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితుడు 'శంకరరావు'కు ఆర్థికసాయం



**మందస, జనవరి 27(వార్త):** తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సవర శంకర రావు క్యాన్సర్ వ్యాధి బారిన పడి విశాఖపట్నంలోని మెడికవర్ హాస్పిటల్లో చికిత్స పొందుకుంటున్నారు. మందస మండలంలోని కొంకడాపుట్టి పంచాయతీలోని కుల్లోగాం గ్రామానికి చెందిన శంకరరావుకు ఆర్థికసాయం అందజేశారు. ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయిస్ యూనియన్(పలాస), గిరిజన చైతన్య వేదిక(టెక్కలి) కొచ్చ శ్రీను, ఆదివాసీ చైతన్య వేదిక(టెక్కలి) వరహాల కృష్ణ, టీడీపీ ఎస్టీ సెల్(పలాస నియోజక వర్గం), పెంటిభద్ర గ్రామ ప్రజలు, ఎస్.మధ్య గ్రామ ప్రజలు, ఆదివాసీ వికాస్ పరిషత్ సభ్యులు కలసి రూ.57వేలను శంకరరావుకు అందజేశారు. కార్యక్రమంలో సవర రాంబాబు, సవర సోమేశ్వరరావు, సవర లక్య, సవర రాజు తదితరులు పాల్గొన్నారు.

## 29న బొగాబందలో భీష్మ ఏకాదశి వేడుకలు

**మందస, జనవరి 27(వార్త):** బొగాబందలో గల యోగాశ్రమంలో ఈ నెల 29న భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్టు యోగిని లక్ష్మీభాయి మాతాజీ చెప్పారు. ఆశ్రమ వ్యవస్థాపకులు స్వామి భాస్కరదాస్ ఆశీస్సులతో భీష్మ ఏకాదశి, 41వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ప్రాతఃకాలం 4గంటలకు సుప్రభాతం, అఖండజ్యోతి ప్రజ్వలన, శంఖధ్వనితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. పూజా కార్యక్రమాలు, సహ స్రనామ అర్చనలు, విష్ణు సహస్రనామ పారాయణం, భైరిసారంగపురం పంచాక్షరి భక్తు లతో శ్రీమద్భగవత్ గీతాపారాయణం, ప్రముఖ స్వామిజీలతో ప్రవచనములు, భక్త సమారాధన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బొగాబంద శ్రీవెంకటేశ్వర భజన బృందం, ఎకువూరు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి భజన బృందం, గొప్పిలి శ్రీకాళీమాత భజన బృందం, భైరిసారంగపురం శ్రీపంచాక్షరి భజన బృందాలతో భజనా కాలక్షేపం ఉంటుందన్నారు. రాత్రి ఏడు గంటలకు కన్నీటి బ్రతుకు అనే సాంఘిక నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చేయాలని ఆమె కోరారు.



## డ్రైనేజీ, రోడ్డు నిర్మించాలి



**సరుబుజ్జిలి, జనవరి 27(వార్త):** పెద్ద సవలాపురం పంచాయతీ సుబ్బపేటలో డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయని, రోడ్డుపై ఇళ్లలోకి బురద నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామ వాసులు వాపోయారు. మూడు రోజుల నుంచి గ్రామంలో రోడ్డు ఇళ్ల ముందు బురద మాయమై దుర్వాసన వస్తోందన్నారు. తమ గ్రామంపై వివక్ష చూపడం దారుణం అన్నారు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే డ్రైనేజీ, రోడ్డు నిర్మించి తమను వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని కోరారు. కొత్త డ్రైనేజీలను నిర్మించాలన్నారు. డ్రైనేజీ ఉన్న ప్రాంతాలలో పూడిక తీత తీయించి బ్లీచింగ్, పిచికారీ చేయించాలని ఆ గ్రామ ప్రజలు కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**పలాస, జనవరి 27(వార్త):** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని శ్రీశయన సాధికారిక కమిటీ మెంబర్ కృష్ణంరాజు ప్రజలను కోరారు. మంగళ వారం కిష్టిపురంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి దగ్గర్లో బాగా చెత్త పేరుకు పోవ డంతో కూటమి నాయకులు, మరోవ్యక్తి కలిసి శుభ్రపరచి, కాల్చి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెత్త గ్రామీణ ప్రాంతాల్లో తరచూ కనిపిస్తుందని, కూటమి నాయకులు, ఇతరులు శుభ్రపరచి నిప్పుతో కాల్చడం ద్వారా తాత్కాలిక పరిష్కారం చేశారని చెప్పారు. ఎల్లప్పుడూ గ్రామం నిత్యము పరిశుభ్రతగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామస్తులు కూడా సహక రించాలని, గ్రామ పరిసరాల్లో శుభ్రంగా ఉంచాలని, తడి, పొడి చెత్త ఉదయం వచ్చిన రిక్షాకి అందజేయాలని కోరారు. ఇల్లు ,గ్రామం శుభ్రంగా ఉంచుకోవడం వల్ల రాగాల బారిన పడకుండా గ్రామానికి కూడా మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయని ఆకాంక్షించారు. ఆ గ్రామ సెక్రటరీ, కూటమి నాయకులను ఎంపీడీవో వసంత్‌కుమార్, ఉన్నతాధికారులు అభినందించారు.



# ఉపాధి హామీ పనుల నుంచి రూ.50వేల రికవరీ

### -సామాజిక తనిఖీ ప్రజా వేదికలో

### బయటపడిన తప్పిదాలు




**మెళియాపుట్టి, జనవరి 27(వార్త):** మెళియాపుట్టి మండలంలోని 37 గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ శాఖల ద్వారా గ్రామాలలో జరిగిన ఉపాధి హామీ పథకానికి సంబంధించి 50వేల రూపాయలను రికవరీకి ప్రొసీడింగ్ అధికారి రాధ రికమెండ్ చేశారు. గడిచిన రెండు నెలల కాలంగా మండలంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఉపాధి హామీ, ఆర్ డబ్ల్యూఎస్, సోషల్ ఫారెస్ట్, సర్వ శిక్ష అభియాన్ తదితర శాఖల ద్వారా 2024- 25వ ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులను సామాజిక తనిఖీ ద్వారా పరిశీలన కార్యక్రమానికి సంబంధించి మండల స్థాయి నివేదికను మంగళవారం మండల కేంద్రంలో గల స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం వెల్లడించారు. పై శాఖలకు సంబంధించి మండల స్థాయిలో 26 కోట్ల 38 లక్షల 20వేల 470 రూపాయలు ఖర్చు జరిగినట్లు తెలియజేస్తూనే, ఉపాధి హామీ పథకానికి సంబంధించి పనులు చేసిన టాస్కులలో తప్పిదాలు జరిగినట్లు డీఆర్పీలు తెలియజేశారు. ఒకే కుటుంబంలో రెండు జాబ్ కార్డులు ఉన్నట్లు గుర్తించినట్లు వారు తెలిపారు. అయితే ప్రస్తుతం పథకం పేరు మార్పుకు అనుగుణంగా ఈ యొక్క జాబ్ కార్డులు తొలగించాలని ప్రొసీడింగ్ అధికారి రాధ తెలియజేశారు. అంతేకాకుండా గ్రామాలలో పలుచోట్ల నాటిన మొక్కలు చనిపోగా, మరలా వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటినట్లు క్షేత్రస్థాయి సిబ్బంది పరిశీలన బృంద సభ్యులకు ఫోటోలు చూపించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన రహదారులు, పాఠశాల ప్రహరీలు ఇతర పనులలో చిన్న చిన్న టాస్కులలో తేడాలు వచ్చాయని, అయితే మండల వ్యాప్తంగా ఎక్కడా కూడా దానికి సంబంధించిన ఓచర్లు బిల్లులు సామాజిక బృందం వారికి అందించలేదన్నారు. దీనికి సంబంధించి ఉపాధి హామీ పథకం సిబ్బంది, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులకు రికవరీలు, అపరాధ రుసుం విధించారు.

ఈ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో అంబుడ్స్ మెన్ గురుమూర్తి, టెక్కలి ఏపీవో డి.శైలజ, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ మాధవరావు, శ్రీకాకుళం డ్వామా హెచ్ఆర్ మేనేజర్ శ్రవణ్, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, ఏపీఓ రవి, డీఆర్పీలు ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల్లో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



**నరసన్నపేట, జనవరి 27 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు "రామాయణం - విద్య విలువలు" అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విశేష ప్రతిభ చాటి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఈ పోటీలను విజయనగరం జిల్లా రామనారాయణంలో ఉన్న ఓ పరిశోధన కేంద్రం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ లాలా లజపతిరాయ్ విద్యార్థులకు బహుమతులు అందజేయడంతో పాటు కళాశాలకు ప్రత్యేక బహుమతి, రామాయణ సాహిత్య గ్రంథాలను సోమవారం ప్రదానం చేశారు. విద్యార్థుల ప్రతిభను ఆయన అభినందిస్తూ, సాంస్కృతిక, నైతిక విలువలను అలవర్చుకునేలా ఇటువంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ పి. లత విజేత విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో కూడా ఇలాంటి పోటీల్లో పాల్గొని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఈ విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

## శక్తి యాప్‌పై యువత అవగాహన పెంచుకోవాలి




**నరసన్నపేట, జనవరి 27 (వార్త):** అసాంఘిక కార్యకలాపాలు, వివిధ రకాల నేరాల నుంచి రక్షణ పొందేందుకు శక్తి యాప్‌పై నేటి యువత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్ తెలిపారు. మంగళవారం నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శక్తి యాప్ మహిళలు, విద్యార్థినులు మాత్రమే కాకుండా ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా రూపొందించబడిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఒక్క క్లిక్‌తో పోలీసులకు సమాచారం చేరే విధంగా ఈ యాప్ పనిచేస్తుందని వివరించారు. విద్యార్థులు ఈ యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసి, ఉపయోగించే విధానంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా యువతలో భద్రతపై జాగ్రత్త పెరుగుతుందని, సమాజంలో నేరాల నియంత్రణకు ఇది దోహదపడుతుందని తెలిపారు.

## ఘనంగా పీఎంశ్రీ ఆదర్శ పాఠశాల వార్షికోత్సవం



**పోలాకి, జనవరి 27 (వార్త):** ఈదులవలసలోని పీఎంశ్రీ ఆదర్శ (మోడల్) పాఠశాలలో 14వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు పైడి ప్రవీణ ఆధ్వర్యంలో నిర్వహించగా, విద్యార్థులకు "ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్" విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులలో జాతీయ సమైక్యత, సాంస్కృతిక ఏకత్వాన్ని పెంపొందించేందుకు వివిధ రాష్ట్రాల సంప్రదాయ వేషధారణలతో ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దేశ వైవిధ్యంలో ఏకత్వాన్ని ప్రతిబింబించేలా విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. భరతనాట్యం అద్భుతంగా ప్రదర్శించిన విద్యార్థి విశ్వేశ్వరరావును ప్రధానోపాధ్యాయురాలు అభినందించి బహుమతి అందజేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ వేడుకలు పాఠశాల ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.

## సౌత్ జోన్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌కు నరసన్నపేట విద్యార్థి ఎంపిక

**నరసన్నపేట, జనవరి 27(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి ఢిల్లేశ్వర రావు సౌత్ జోన్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.లత మంగ ళవారం తెలిపారు. ఈ సౌత్ జోన్ ఇంటర్ యూని వర్సిటీ క్రికెట్ పోటీలు ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు మైసూరు నగరంలో నిర్వహించ నున్నట్లు ఆమె వివరించారు. అంబేడ్కర్ యూనివర్సిటీ తరఫున ఢిల్లేశ్వరరావు ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. క్రీడలతో పాటు విద్యలోనూ ప్రతిభ చూపుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో కళాశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని ప్రిన్సిపల్ పేర్కొ న్నారు. ఈ సందర్భంగా పీడీ భోగేశ్వరరావు, అధ్యాపకులు డిల్లేశ్వరరావును అభినం దించి, టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల స్థాయి నుంచి జోనల్ స్థాయికి విద్యార్థి ఎంపిక కావడం పట్ల విద్యా ర్థులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



## హేమసుందర్‌కు సన్మానం

**సంతబొమ్మాళి, జనవరి 27 (వార్త):** మరువాడ, మేఘవరం పంచాయతీలకు సంబంధించిన జూనియర్ లైన్‌మన్ నౌవగాన హేమసుందర్‌కు ఏపీఈపీడీసీఎల్, శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేత ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేఘవరం సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మరువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు, మేఘవరం మాజీ సర్పంచ్ ప్రతినిధి పరపటి రాజశేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు హాజరై హేమసుందర్‌ను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.



## ఉత్తమ అధికారులకు ఘన సన్మానం



**జలుమూరు, జనవరి 27 (వార్త):** జలుమూరు మండలంలో వైద్య, విద్యా రంగాల్లో విశిష్ట సేవలందించిన అధికారులను జిల్లా స్థాయిలో ఘనంగా సత్కరించారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి పూజారి సుజాతకు, సవిరిగాం పీహెచ్సీకి చెందిన ఎంపీహెచ్ఇఓ సిమ్మ సోమేశ్వరరావుకు జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ కె.అనిత ఉత్తమ సేవల అవార్డులను అందజేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో వారి సేవలు ఆదర్శనీయమని ఈ సందర్భంగా ప్రశంసించారు. విద్యారంగంలో సీఆర్ఎంటీగా మండల ఎమ్మార్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పి. వైకుంఠరావుకు ఉత్తమ సేవల అవార్డు లభించింది. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాలరావు చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎం.వి.ఆర్.ఎస్. ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు. సేవాభావంతో విధులు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న వీరి సేవలు మరింత మందికి ప్రేరణగా నిలవాలని వారు ఆకాంక్షించారు.

## 12న సమ్మెను జయప్రదం చేయాలి

**నరసన్నపేట, జనవరి 27 (వార్త):** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను ఎలక్ట్రిషన్ అండ్ ప్లంబర్లు జయప్రదం చేయాలని నరసన్నపేట నియోజకవర్గం ఎలక్ట్రిషన్ అండ్ ప్లంబర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు తలసముద్రం మోహనరావు మాట్లాడుతూ, కొత్త లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను కాలరాస్తూ పని గంటలను పెంచి కార్మికులను కట్టుబానిసలుగా మార్చేలా ఉన్నాయని విమర్శించారు. ఈ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులలో భాగంగా పనిచేస్తున్న ఎలక్ట్రిషన్‌లు, ప్లంబర్లకు సంక్షేమ నిధుల ప్రయోజనాలు అందకపోవడం వల్ల పని ప్రదేశాల్లో భద్రత లేక ప్రాణాపాయ పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొ న్నారు. ప్రమాదాల్లో మరణించినా ప్రభుత్వం సరైన విధంగా ఆదుకోవడం లేదని ఆవే దన వ్యక్తం చేశారు. కార్మికుల నుంచి సెస్సు రూపంలో వసూలు చేసిన నిధులు కార్మిక శాఖలోనే నిలిచిపోయి, వాటిని ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని గుర్తు చేశారు. ఎలక్ట్రిషన్‌లు, ప్లంబర్లకు అవసరమైన పని ముట్లు అందించి, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఏర్పాటు చేసి, వారి జీవన భద్రతను మెరుగుపరచాలని ప్రభుత్వాలను కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి సమ్మె ఒక్కటే మార్గమని పేర్కొంటూ ఫిబ్రవరి 12 సమ్మెలో ఎలక్ట్రిషన్‌లు, ప్లంబర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల కోసం పోరాటాన్ని బలపరచాలని యూనియన్ నేతలు పిలుపు నిచ్చారు.



## సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిని కలిసిన జిల్లా కమిటీ సభ్యులు

**ఎల్ఎన్ పేట/ హిరమండలం (వార్త):** సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా కమిటీ ప్రతినిధులు రాష్ట్ర ఉపాధ్యక్షులు జాషువాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని సామాజిక న్యాయం, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు ఎదురవుతున్న సమస్యలను దాసువ దృష్టికి తీసుకెళ్లారు. భూ సమస్యలు, దళితులకు ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు జరుగుతున్న అన్యాయాలను వివరించి, వాటి పరిష్కారానికి కమిటీ మద్దతు కోరారు. సభ్యులు తెలిపిన సమస్యలపై రాష్ట్ర ఉపాధ్యక్షులు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా సొసైటీ తరఫున పూర్తి పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలవడంలో శ్రీకాకుళం జిల్లా కమిటీ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు కార్యక్రమంలో జిల్లా కమిటీ ప్రతినిధులు, జిల్లా నాయకులు జిల్లా అధ్యక్షులు బలగ రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జామాన రామారావు జిల్లా ఇన్‌చార్జి కర్రి అమ్మారావు, జిల్లా ఉపాధ్యక్షులు సామ హిరణ్యారావు, జిల్లా జాయింట్ సెక్రటరీ ముంజేటి రాము తదితరులు పాల్గొన్నారు.



## నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి



**నరసన్నపేట, జనవరి 27 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీలో గత ఐదు సంవత్సరాలుగా పాలకవర్గం నిర్వహించిన అభివృద్ధి పనుల్లో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని పట్టణ టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఇన్‌చార్జి ఈవో ద్రాక్షాయణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ, పంచాయతీ నిధులతో చేపట్టిన పనుల్లో పారదర్శకత లోపించిందని, ఖర్చుల వివరాల్లో అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం జరిగిందా లేదా అన్నది తేల్చేందుకు సమగ్ర విచారణ అత్యవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీ పీసా కృష్ణ పాల్గొని విచారణను వెంటనే ప్రారంభించి బాధ్యులపై చర్యలు తీసుకోవా లని కోరారు. ప్రజలకు నిజాలు తెలియజేయాలంటే అధికారుల స్థాయి లో విచారణ జరగాలని వారు స్పష్టం చేశారు.


## రూ.2కోట్లతో గొట్టిపల్లి, కొమ్మువలస రోడ్డు



**ఎల్ఎన్ పేట, జనవరి 27(వార్త):** మోదుగువలస జంక్షన్ నుంచి కొమ్మువలస మీదుగా గొట్టిపల్లి వరకు సుమారు రెండు కోట్ల రూపాయలతో రోడ్డు పనులకు మండల టీడీపీ నాయకులు అంపిలి పోలినాయుడు, పొన్నాన రామకృష్ణ మాస్టారు, గుండపు గణేష్ తదితరులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మోదుగువలస జంక్షన్ నుంచి గొట్టిపల్లి గ్రామం వరకు రహదారి అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు ప్రయాణికులు నానా పాట్లు పడాల్సి వస్తోందని..పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా, వెంటనే ఆయన చొరవ తీసుకొని మోదుగువలస జంక్షన్ నుంచి గొట్టిపల్లి గ్రామం వరకు సుమారు రెండు కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. ఆయనకు ఆయా గ్రామాల తరఫున వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివ్వాల కిశోర్‌బాబు, గేదెల బామయ్య, శిమ్మ మోహనరావు, గుండపు రాము, నడిపల్లి నారాయణ రావు, ధర్మాన మసలయ్య, గేదెల గజపతి, జమ్మి మోహనరావు, పొన్నాన బాలకృష్ణ, మహంతి సూర్యనారాయణ, అంబటి జోగారావు, మూకళ్ల అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రామయ్యపట్నం రోడ్డు పనులపై హర్షం



**సోంపేట, జనవరి 27(వార్త):** రామయ్యపట్నం నుంచి ఇసకలపాలెం మీదుగా తలతంపర వరకు రోడ్డు నిర్మాణ పనుల పట్ల రామయ్య పట్నం గ్రామానికి చెందిన టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు. నేతలు నిట్ట గోపాల్ మద్దు రాజారావు బైపల్లి బాబురావు జి కూర్మారావు వాసుపల్లి రాజారావు తదితరులు మంగళవారం రోడ్డు పనులు పరిశీలించారు. ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ కృషితో ఈ రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ రహదారి నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం హయాంలో జరగడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. మత్స్యకార గ్రామాలకు ఎంతో ప్రయోజనం గల ఈ రహదారిని గతంలో పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే కృషి పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546